సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం । 10 । ఫిబ్రవరి । 2025



పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: అటవీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. రాష్ట్రంతో పాటు తెలంగాణ నుంచి భక్తులు తరలివచ్చారు.



ఆశాజనకంగా వర్జీనియా

ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో వర్జీనియా పొగాకు పంట ఆశాజనకంగా ఉంది. పొగాకు రెల్పులు, క్యూరింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 8లో ▸



నరసన్న కల్యాణోత్సవాలు

చినవెంకన్న దత్తత ఆలయం ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. 8లో ▸

న్యూస్‌రీల్

బోడపాడు.. పట్టని కోడ్



బోడపాడులో జనసేన ఫ్లెక్సీ

పెంటపాడు: జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా బోడపాడు గ్రామంలో మాత్రం అమలు కావడం లేదు. రాజకీయ నాయకుల విగ్రహాలు, పార్టీ స్థూపాలకు ముసుగులు వేయడంతో పాటు పార్టీల ఫ్లెక్సీలను తొలగించాల్సి ఉంది. అయితే బోడపాడు గ్రామంలో మాత్రం వీటివైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదు. దీంతో పలు ప్రాంతాల్లో జనసేన, టీడీపీ ఫ్లెక్సీలు కనిపిస్తున్నాయి.

ముగిసిన జాతీయ సమైక్యతా శిబిరం



అధికారులను సత్కరిస్తున్న దృశ్యం

నరసాపురం: పట్టణంలోని వైఎన్ కళాశాలలో వారంరోజుల నుంచి జరుగుతున్న జాతీయ సమైక్యతా శిబిరం ఆదివారం ముగిసింది. మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్, జాతీయ సేవా పథకం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన శిబిరానికి 12 రాష్ట్రాలకు చెందిన 200 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు హాజరయ్యారు. జాతీయ సేవా పథకం లక్ష్యాలను వివరించే పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి వైఎన్ కళాశాల కోశాధికారి పోలిశెట్టి రఘురామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయస్థాయిలో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని తమ కళాశాలలో రెండోసారి నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, డీన్ గంధం శ్రీరామకృష్ణ, సామాజిక సేవా విభాగం కన్వీనర్ ప్రసాద్ పాల్గొన్నారు.


ఏలూరులో 'తండేల్' సందడి



అభివాదం చేస్తున్న హీరో నాగచైతన్య

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హీరో నాగచైతన్య ఏలూరులో సందడి చేశారు. తండేల్ చిత్ర విజయ యాత్రలో భాగంగా ఆయన ఆదివారం మధ్యాహ్నం అంబికా థియేటర్‌కు వచ్చారు. అభిమానులు భారీ గజమాల, బాణసంచాతో స్వాగతం పలికారు. ఈ సినిమా కోసం రెండేళ్లు కష్టపడ్డామని, ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందనతో కష్టాన్ని మరచిపోతున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తండేల్‌కు విశేష ఆదరణ లభిస్తోందని, ఈ విజయాన్ని ప్రేక్షకులతో పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. చిత్రంలోని డైలాగ్‌లు చెప్పి ఉత్సాహపరిచారు. దర్శక, నిర్మాతలు చందు మొండేటి, బన్నీ వాసు, సినీ నిర్మాత అంబికా కృష్ణ పాల్గొన్నారు.

నీటితొట్టిలో పడి బాలుడు మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

ముసునూరు: ముద్దులొలికే బాలుడు ఆటలాడుకుంటూ నీటి తొట్టిలో పడి ఊపిరాడక మృత్యువాత పడిన ఘటన కలచివేసింది. అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమారుడు తమ కళ్లముందే విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. ప్రమాదవశాత్తు నీటితొట్టిలో పడి నాలుగేళ్ల బాలుడు మృతిచెందిన ఘటన ఏలూరు జిల్లా ముసునూరు మండలం గోపవరం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన పుల్లిచర్ల సురేష్, నాగశ్రీ దంపతులకు లోకేష్ (4), రెండేళ్ల కుమార్తె ఉన్నారు. కూల్‌డ్రింక్ షాపు నడుపుకుంటూ సురేష్ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఇంటి ఆవరణలో బాలుడు లోకేష్ కేరింతలు కొడుతూ అల్లరి చేస్తూ ఆడుకుంటుండగా సమీపంలోని వరల నీటి తొట్టిలో పడ్డాడు. అయితే ఈ విషయాన్ని ఎవరూ గమనించలేదు. పిల్లవాడు ఆడుకుంటున్నాడని అందరూ భావించారు. పది నిమిషాల తర్వాత బాలుడు కనిపించకపోవడంతో కంగారు పడిన తల్లిదండ్రులు వెతకగా నీటితొట్టిలో పడి ఉన్నాడు. బాలుడిని తొట్టిలో నుంచి బయటకు తీసి చూడగా అప్పటికే కన్నుమూశాడు. అప్పటివరకూ తమ కళ్ల ముందు కదలాడిన బాలుడు ఇలా మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. వీరు నివసిస్తున్న కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి.

- కూటమి ప్రభుత్వం వస్తే వలంటీర్ల వేతనం రూ.10 వేలంటూ ఎన్నికల్లో ఊదరగొట్టిన 'నిమ్మల'
- గెలిచాక తనకు చించినాడ పూతరేకులు తెచ్చివ్వాలంటూ ప్రచారం
- నాటి వీడియోను ఇప్పుడు వైరల్ చేస్తున్న నెటిజన్లు
- పూతరేకులు దొరకడం లేదంటూ సెటైర్లు
- హామీలు విస్మరిస్తే సోషల్ మీడియా నుంచి తప్పించుకోలేరంటూ పోస్టులు
- **ఇప్పటికే నీకు 15 వేలు.. నీకు 15 వేలు.. వీడియోతో ఆటాడుకున్న నెటిజన్లు**







ఎన్నికల ప్రచారంలో వలంటీర్లతో మాట్లాడుతున్న నిమ్మల రామానాయుడు వీడియోతో రీల్స్

ఓ మంత్రిగారు..

చించినాడ పూతరేకులు !

సాక్షి, భీమవరం : 'చంద్రబాబునాయుడుగారు, పవన్ కళ్యాణ్‌గారు చెప్పారమ్మా.. మీ వలంటీరు జాబ్‌కు రూ.5 వేలు ఏ మూలకి సరిపోతాయి? ఖర్చులు బోలెడు పెరిగిపోయాయి కదా? మన ప్రభుత్వంలో వలంటీరు వ్యవస్థను కొనసాగిస్తాం. మీకు రూ.10 వేలు జీతం ఇస్తాం. రేపొద్దున్న మన ప్రభుత్వంలో అన్నయ్యా ఇదిగో 10 వేలు అందుకున్నానని ఆనందంగా మన చించినాడ పూతరేకుల ప్యాకెట్ పట్టుకుని రావాలి'.. అంటూ పాలకొల్లు నియోజకవర్గం ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యేగా నిమ్మల రామానాయుడు ఎక్కడ వలంటీరు కనిపించినా ఈ హామీ ఇచ్చేవారు. రూ.10 వేలు తీసుకున్నాక ఆనందంగా చించినాడ పూతరేకుల ప్యాకెట్ కానుకగా ఇవ్వాలని చెప్పి ఆకట్టుకునే ప్రయత్నం చేసేవారు. అప్పట్లో ఆయన పాలకొల్లు కళాకారులనే మించిపోయారు. ఇంటింటికీ వెళ్లి అమ్మ, అక్క, చెల్లి, బావ, తమ్ముడు.. అని అందరితో వరసలు కలుపుతూ సూపర్ సిక్స్‌లో ఎవరెవరికి ఎంత నగదు వస్తుందో తనదైన శైలిలో వివరించేవారు. ఆనక ఆ వీడియోలను సోషల్ మీడియాలో పోస్టులు చేయించుకునే వారు. ఇప్పుడదే ఆయన్ను వెంటాడుతోంది. కూటమి ప్రభుత్వం పాలన పగ్గాలు చేపట్టి ఎనిమిది నెలలు కావస్తోంది. ఆర్థిక పరిస్థితి చూస్తుంటే హామీల అమలు సాధ్యం కాదంటూ సీఎం చంద్రబాబు చేతులెత్తేయ్యడంతో సూపర్‌సిక్స్ కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న ప్రజలు సోషల్ మీడియా వేదికగా తమ అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్, నిమ్మల ప్రసంగాలు, వాటి అమలుకు ఇప్పుడు చేతులెత్తేసిన దృశ్యాలతో రీల్స్ ద్వారా ఓ రేంజ్‌లో ఆడుకుంటున్నారు.

మంత్రి నిమ్మలకు రీల్స్ సెగ

ఇక పాలకొల్లులోని ఒక ఇంటి వద్ద ఉన్న చిన్నపిల్లలను చూపిస్తూ నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు అంటూ నాడు నిమ్మల రామానాయుడు చెప్పిన వీడియో ఎంత పాపులర్ అయ్యిందో తెలిసిందే. తల్లికి వందనం ఇప్పట్లో రాదని తెలిసి ఆ వీడియోకు గోదావరి వెటకారం, యాసను జోడించి మరీ నెటిజన్లు రీల్స్ చేసి మంత్రి నిమ్మలకు వ్యతిరేకంగా పోస్టు చేస్తున్నారు. కొంద రైతే తమ సెల్‌ఫోన్లకు ఈ ఆడియోను రింగ్‌టోన్లుగా పెట్టేసుకున్నారు. ఇలా గత ఆరు రోజులుగా నిమ్మల హామీకి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో ట్రెండవుతున్నాయి. అలాగే, మన ప్రభుత్వంలో మీకు రూ.10 వేలు వేతనం వచ్చిన **ఆనందంతో కానుకగా తనకు చించినాడ పూతరేకులు తీసుకొచ్చి ఇవ్వాలంటూ వలంటీర్లతో చెప్పిన వీడియోలను జతచేసి సోషల్ మీడియాలో వేల సంఖ్యలో షేర్ అవుతున్నాయి. వలంటీర్లను కొందరు కూటమి నేతలు వంచించిన తీరును ఎండగడుతుండగా, మరికొందరు వాటికి మద్దతుగా కామెంట్లు పెడుతూ నిరసన తెలుపుతున్నారు. పూతరేకులు** దొరక్క కలవలేకపోయారంటూ వంటి పోస్టులతో ఆడుకుంటున్నారు. అధికారం కోసం హామీలిచ్చేయ్యడం, గద్దెనెక్కాక వాటిని విస్మరించడం పూర్వపు రోజులని.. ఇప్పుడు సోషల్ మీడియా నుంచి ఎవరూ తప్పించుకోలేరంటూ సెటైర్లు వేస్తున్నారు. పూర్తిస్థాయిలో సూపర్‌సిక్స్ హామీలు అమలు చేసేవరకూ కూటమి నేతలకు రీల్స్ సెగ తప్పదంటున్నారు.

దళితులంటే రఘురామకు

చులకన



మాట్లాడుతున్న దళిత జేఏసీ నాయకులు

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజుకి దళితులంటే చులకన అని దళిత సంఘాల జేఏసీ నేతలు మండిపడ్డారు. స్థానిక లేడీస్ క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఏఐఎమ్ జిల్లా అధ్యక్షుడు వాసే ఆనంద్ మాట్లాడుతూ ఆకివీడులో చెరువుల ఆక్రమణలు తొలగించడంతో నిరాశ్రయులైన దళితులు, బడుగు, బలహీన వర్గాలను తాము పరామర్శించేందుకు వెళితే విద్వేషాలు రెచ్చగొట్టేందుకు వచ్చారంటూ తప్పుడు ప్రచారాలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఏఐఎమ్ స్టిక్కర్లు ఉన్న వాహనంలో వెళ్లడం నేరమెలా అవుతుందని ధ్వజమెత్తారు. అలాగే సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌పై రఘురామ అవాకులు చవాకులు మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐఎమ్‌పై అక్కసుతో నేతలపై కేసులు పెట్టించడం దారుణమన్నారు. గతంలో అంబేడ్కర్ ఫ్లెక్సీని చించివేసిన ఘటనలో రఘురామపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వంలో వదిలేసిందని విమర్శించారు. ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ఆకివీడు ఘటనపై హైకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం బెనిఫిట్స్ అందజేయాలని కోరారు. రిటైర్డ్ ఐఆర్ఎస్ చాగంటి సంజీవ్, జేఏసీ నాయకులు అంబటి నాగేంద్ర ప్రసాద్, సత్యం మాస్టర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు



వెంపలో డ్రైయిన్లలో బ్లీచింగ్ చల్లుతున్న దృశ్యం

సాక్షి స్పందన

భీమవరం అర్బన్: 'చెత్త కుప్పలు.. ముప్పు తిప్పలు' శీర్షికన 'సాక్షి'లో ఈనెల 8న ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. భీమవరం మండలంలోని దిరుసుమర్రు, వెంప, యనమదుర్రు, కొత్తపూసలమర్రు, గొల్లవాని తిప్ప, తాడేరు, కొమరాడ తదితర 25 గ్రామాల్లో ఆదివారం స్వచ్ఛభారత్‌లో భాగంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈఓపీఆర్డీ పర్యవేక్షణలో కార్యదర్శులు డ్రైయిన్లలో సిల్టు, పూడిక తొలగింపు పనులు చేయించి బ్లీచింగ్ చల్లించారు. గ్రామంలో పేరుకుపోయిన చెత్తను సంప్రద కేంద్రాలకు తరలించారు.

ముసుగు పడింది



ఆకివీడులో విగ్రహానికి ముసుగు వేసిన దృశ్యం

ఆకివీడు: 'ఎన్నికల కోడ్ జాడేది?' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వర రావు స్పందించారు. నగర పంచాయతీలో ఆయా పార్టీ జెండాలు, ఫ్లెక్సీలను తొలగించడంతో పాటు విగ్రహాలు, పార్టీ స్థూపాలకు ముసుగులు వేసేలా పంచాయతీ కమిషనర్‌తో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. మండలంలోని కాళింగగూడెంలో ఫ్లెక్సీలు తీసేందుకు వెళ్లిన తనను గ్రామానికి చెందిన నాయకులు అడ్డుకుని, ఫ్లెక్సీలు తొలగించవద్దని వారించినట్టు గ్రామ కార్యదర్శి సతీష్ వాపోయారు.

నేటి నుంచి బాలరావమ్మ తిరునాళ్ల

ఆగిరిపల్లి: కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారం తోటపల్లిలోని బాలరావమ్మ తల్లి తిరునాళ్ల సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మండలంలోని ఆగిరిపల్లి, తోటపల్లి, కనసానపల్లిలోని ఆలయాల వద్ద దుగ్గిరాల బాలరావమ్మ తల్లి తిరునాళ్ల ఈనెల 12 వరకు నిర్వహిస్తారు. మండలంలోని మూడు గ్రామాల్లో ఒకేసారి తిరునాళ్ల నిర్వహించడం విశేషం. తోటపల్లిలో జరిగే తిరునాళ్లకు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు. తొలిరోజు పల్లకి సేవ, 11న తోటపల్లిలో రాత్రి 9 గంటలకు ఊరేగింపు, 12న అమ్మవారికి పాల పొంగళ్ల సమర్పణ, విశేషాలంకరణ, కుంకుమార్చన, పూలంగి, ఉయ్యాల సేవలు నిర్వహిస్తారు. మాఘ పౌర్ణమి రోజున ఉత్సవాలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ.

మద్యం షాపుల డ్రా వాయిదా

భీమవరం: భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గీత కులాలకు కేటాయించిన మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ముగిసిందని ఎక్సైజ్ సీఐ బలరామరాజు తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోమవారం నిర్వహించాల్సిన షాపుల డ్రాని వాయిదా వేశామని చెప్పారు. డ్రా తీసే తేదీ, స్థలాన్ని తర్వలో తెలియజేస్తామన్నారు.



గజలక్ష్మీ నమోస్తుతే

భీమవరం పట్టణ ఇలవేల్పు.. భక్తుల కొంగు బంగారం.. మావుళ్లమ్మవారి ఆలయ 61వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు గజలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

\- భీమవరం (ప్రకాశం చౌక్)

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

భీమవరం: ఇంటర్మీడియెట్ జనరల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ సోమవారం నుంచి ఈనెల 19 వరకు జరుగుతాయని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి ఎ.నాగేశ్వరరావు తెలిపారు. జిల్లాలో 73 కేంద్రాల్లో జరిగే పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లను సిద్ధం చేశామన్నారు. తొలిరోజు ఉదయం, మధ్యాహ్నం షిఫ్టుల్లో 5,680 మంది విద్యార్థులు హాజరవుతారని చెప్పారు.

సమష్టిగా 'నులి'మేద్దాం

- నేడు నులిపురుగుల నివారణ దినోత్సవం
- 1 నుంచి 19 ఏళ్ల వయసున్న వారికి మాత్రల పంపిణీ
- జిల్లాలో 3.61 లక్షల మంది లక్ష్యం



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)



ఆల్బెండజోల్ మందులు

భీమవరం(ప్రకాశం చౌక్): నులి పురుగుల వల్ల పిల్లలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారు. ముఖ్యంగా రక్తహీనత, పోషకాహారలోపం బారిన పడతారు. ఆకలి మందగించడం, బలహీనత, ఆందోళన, కడుపునొప్పి, వికారం, అతిసారం, మలంలో రక్తం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. నులి పురుగులు ఉన్న చిన్నారులు ఆరుబయట మలవిసర్జన చేస్తే అవి ఇతరులలోకి ప్రవేశించే అవకాశం ఉంది.

ముందు జాగ్రత్తలతో..

మల పరీక్ష ద్వారా నులి పురుగులను గుర్తించవచ్చు. నులి పురుగుల లార్వాలో 20 లోపు ఉంటే మామూలు, వాటి సంఖ్య 20 నుంచి 40 వరకు ఉంటే మధ్యస్థం, 40కి పైగా ఉంటే తీవ్రంగా ఉన్నట్లు నిర్ధారిస్తారు. అయితే ముందు జాగ్రత్తలతో వీటిని నివారించవచ్చని వైద్యులు చెబుతున్నారు. నివారణకు పరిశుభ్రతను మించిన మందు లేదని స్పష్టం చేస్తున్నారు. నులి పురుగుల వల్ల పిల్లల్లో శారీరక ఎదుగుదల ఆగిపోతుంది. దీంతో పిల్లలు బక్కచిక్కినట్లు కనిపిస్తారు. కడుపులో నొప్పి వస్తుంది. నులి పురుగులను నివారిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులు అవుతారు. అంతేకాకుండా రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

నులిపురుగుల నివారణ లక్ష్యంగా ఏటా ఫిబ్రవరి 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహిస్తారు. జిల్లాలో ఏడాది నుంచి 19 ఏళ్ల వయసున్న పిల్లలు, యువతకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తారు. జిల్లావ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఆల్బెండజోల్ మాత్రలు వైద్య సిబ్బంది వద్దకు చేరుకున్నాయి. జిల్లాలోని అంగన్‌వాడి కేంద్రాలు, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్, ఒకేషనల్ కాలేజీలు, నర్సింగ్ కళాశాల్లో విద్యార్థులతో పాటు బడిబయట పిల్లలకు మాత్రలు అందిస్తారు. ఒకటి నుంచి రెండేళ్ల లోపు పిల్లలకు సగం మాత్ర, ఆపై వయసున్న వారికి పూర్తి మాత్ర వేయనున్నారు. సోమవారం మాత్రలు పంపిణీ చేయని వారికి ఈనెల 17వ తేదీన అందించేలా చర్యలు తీసుకున్నారు.

జిల్లాలో 3.61 లక్షల మంది..

జిల్లాలో ఏడాది నుంచి 19 ఏళ్ల వయసున్న వారు 3,61,272 మంది ఉన్నారు. జిల్లాలో అంగన్‌వాడీ సెంటర్లు 1,617, యాజమాన్యాల కింద నడుస్తున్న పాఠశాలలు 1,894, సాంకేతిక విద్యాసంస్థలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు 165 ఉన్నాయి. వాటిలో విద్యార్థులతో పాటు బడి బయట పిల్లలు 1,309 మందిని గుర్తించి మాత్రలు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు జిల్లాకు 3.90 లక్షల ఆల్బెండజోల్ మాత్రలు వచ్చాయి.

పాటించాల్సిన జాగ్రత్తలు

- గోళ్లను శుభ్రంగా కత్తిరించుకోవాలి.
- ఆహారంపై ఈగలు, దోమలు వాలకుండా జాగ్రత్త వహించాలి.
- బహిరంగ ప్రదేశంలో మల విసర్జన చేయకుండా మరుగుదొడ్లను ఉపయోగించాలి.
- భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలి.
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- పిల్లలు చెప్పులు ధరించి బయటకు వెళ్లేలా చూసుకోవాలి.

తల్లితండ్రులు బాధ్యత తీసుకోవాలి



పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించడంలో తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి. అధికారుల సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతానికి చర్యలు తీసుకున్నాం. పిల్లలకు మాత్రలు వేసినప్పుడు సమస్యలు ఎదురైతే సేవలందించేందుకు జిల్లావ్యాప్తంగా 18 బృందాలను సిద్ధం చేశాం.

\- సీహెచ్ నాగరాణి, కలెక్టర్

ఆహారం తీసుకున్న తర్వాతే..



ఆల్బెండజోల్ మాత్రలను ఆహారం తీసుకున్న తర్వాత శుభ్రమైన తాగునీరుతో వేయాలి. ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, పారామెడికల్ సిబ్బంది ఈ మేరకు అవగాహన కల్పిస్తారు. నులిపురుగుల వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తకుండా నివారణ మాత్రలను తప్పక వేయించాలి.

\- డాక్టర్ భానునాయక్, జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ

చెరువు మట్టి.. కొల్లగొట్టి..

పచ్చ నేతల అక్రమ తవ్వకాలు



సూర్యచంద్రరావుపేట చెరువు నుంచి ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: మండలంలోని సూర్యచంద్రరావుపేట చెరువులో పచ్చ నేతల మట్టి అక్రమ తవ్వకాలు ఆదివారం యథేచ్ఛగా సాగాయి. ప్రధాన రహదారి పక్కనున్న ఈ చెరువులో పట్టపగలే పొక్లయిన్లతో తవ్వకాలు జరుపుతున్నా ఇరిగేషన్, మైనింగ్, రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడలేదు. ఎడాపెడా తవ్వేయడంతో చెరువులో అగాధాలు ఏర్పడుతున్నాయని, ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామ రెవెన్యూ అధికారికి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అంటున్నారు. దీనిపై వీఆర్వో చంద్రలీలను ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

క్లుప్తంగా

బాస్కెట్‌బాల్ పోటీలకు రమణక్కపేట విద్యార్థినులు



విద్యార్థినులను అభినందిస్తున్న పీడీ నాగరాజు

ముసునూరు: రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు తమ విద్యార్థినులు ఎంపికై, కృష్ణా జిల్లా జట్టులో స్థానం సాధించినట్లు హెచ్‌ఎం పీవీఎస్ రామకృష్ణారావు తెలిపారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ నెల 11 వరకు తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో అండర్–16 విభాగంలో రమణక్కపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు నాగసుధ, భార్గవి ఉమ్మడి కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు తరపున పాల్గొంటున్నట్లు చెప్పారు.

ఫిజికల్ డైరెక్టర్లకు రాష్ట్ర స్థాయి పతకాలు



పథకాలు సాధించిన ఫిజికల్ డైరెక్టర్ ఎం.కృష్ణారావు, పద్మజా జయలక్ష్మి

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో పోతునూరు ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.కృష్ణారావు, కలపర్రు ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పీ.పద్మజా జయలక్ష్మి రాష్ట్ర స్థాయి పతకాలు సాధించారు. ఆదివారం అనంతపురంలో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్‌లో హైజంప్‌లో ఎం.కృష్ణారావు, హైజంప్ 800 మీటర్లు, 100 మీటర్ల పరుగులో పద్మజా జయలక్ష్మి విజయం సాధించారు.

గంగానమ్మ, పెద్దింటమ్మకు జలాభిషేకం



ఆకివీడు: కాళింగగూడెంలో గంగానమ్మకు మహిళలు జలాభిషేకం చేస్తున్న దృశ్యం

ఆకివీడు: కొల్లేరు తీరంలోని కాళింగూడెంలో కొలువుదీరిన గ్రామ దేవతలు గంగానమ్మ, పెద్దింటమ్మ జాతర మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. తూర్పువైపున ఉన్న గంగానమ్మకు, పడమర వైపున ఉన్న గ్రామ దేవత పెద్దింటమ్మకు జలాభిషేకం చేశారు. తొలుత ప్రతి ఇంటి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ దేవతలకు పసుపు నింపిన జలాల్ని బిందెలతో ఊరేగింపుగా తీసుకువచ్చి జలాభిషేకం చేశారు. గ్రామ ఆచారం ప్రకారం తొలుత జలాభిషేకం, అమ్మవార్లకు మొక్కు తీర్చుకునేందుకు పాట నిర్వహించగా రూ.75 వేలకు పాడుకున్న దుంపల పెద్దింట్లు ముందుగా మొక్కు తీర్చుకుని, అమ్మవార్లకు జలాభిషేకం చేశారు. శక్తి వేషాలు, డప్పులతో ఆ ప్రాంతం మార్మోగింది.

ఆశాజనకంగా వర్జీనియా సాగు

- ఏజెన్సీ, మెట్టలో ప్రారంభమైన పొగాకు క్యూరింగ్ పనులు
- దిగుబడిపై పెరుగుతున్న నమ్మకం
- గత ఏడాది రికార్డు స్థాయిలో పలికిన ధర
- 58.94 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి బోర్డు అనుమతి



బుట్టాయగూడెం మండలం కొమ్ముగూడెం సమీపంలో వేసిన పొగాకు పంట



క్యూరింగ్ చేసిన పొగాకును పరిశీలిస్తున్న బోర్డు అధికారులు

బుట్టాయగూడెం: ఏజెన్సీ మెట్ట ప్రాంతాల్లో పండిస్తున్న వర్జీనియా పొగాకు పంట ఆశాజనకంగా ఉంది. పొగాకు రెల్పులు, క్యూరింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 2024 అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకూ ఏజెన్సీ మెట్ట ప్రాంతాల్లో అత్యధికంగా రైతులు వరి, మొక్కజొన్న, మిరప, చెరకు తర్వాత పొగాకు పంటనే వేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని జంగారెడ్డిగూడెం–1, 2, దేవరపల్లి, కొయ్యలగూడెం, గోపాలపురం వేలం కేంద్రాల పరిధిలో తేలిక నేలల్లో రైతులు ఎంతో కాలంగా వర్జీనియా పొగాకు సాగు చేస్తున్నారు. ఇక్కడ పండించిన పంటకు అంతర్జాతీయ మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉంటుంది. దీంతో అనేక మంది రైతులు జీడిమామిడి తోటలను సైతం తొలగించి పొగాకు పండిస్తున్నారు. ప్రస్తుతం 4 దశల్లో రెల్పులు జరగగా క్యూరింగ్ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

28,719 హెక్టార్లలో సాగు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని జంగారెడ్డిగూడెం–1, 2, కొయ్యలగూడెం, గోపాలపురం, దేవరపల్లి వేలం కేంద్రాల పరిధిలో ఈ ఏడాది సీజన్‌లో 12,487 మంది రైతులు సుమారు 28,719 హెక్టార్లలో వర్జీనియా పొగాకు పంటలు వేసినట్లు అధికారులు వెల్లడించారు. 23,575 హెక్టార్లలో పంటసాగుకు రైతులు బోర్డులో రిజిస్ట్రేషన్ చేసుకోగా దీనికి మించి అదనంగా సుమారు 5 వేల హెక్టార్లలో పంట వేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇది కాకుండా మరో 5 వేల హెక్టార్లలో పంట వేసినట్లు సమాచారం. ఈ ఏడాది పొగాకు ఉత్పత్తి సుమారు 80 మిలియన్ కిలోలు ఉంటుందని అధికారులు, ట్రేడర్లు అంచనా వేస్తున్నారు. బోర్డు మాత్రం 58.94 మిలియన్ కిలోల ఉత్పత్తికి మాత్రమే అనుమతి ఇచ్చింది. గత ఏడాది 48.48 మిలియన్ల కిలోల ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇవ్వగా 67.24 మిలియన్ కిలోల ఉత్పత్తి జరిగినట్లు బోర్డు అధికారులు చెప్పారు.

ధరపైనే ఆశలు

పొగాకు రంగులు ఆశాజనకంగా కనిపించడంతో దిగుబడులపై గంపెడు నమ్మకం పెట్టుకున్నారు. గత రెండేళ్లుగా రికార్డు స్థాయిలో వచ్చిన మాదిరిగానే ఈ ఏడాది కూడా ధర పలుకుతుందని రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. గతంలో పొగాకు పంటకు వచ్చిన ధరలను చూసి ఈ ఏడాది అత్యధికంగా రైతులు పొగాకు పంటలు వేశారు. ఎన్నడూలేని విధంగా భూమి కౌలు కూడా ధరలు భారీగా పెరిగాయి. గిరిజన ప్రాంతంలో ఎకరాకు రూ.80 వేల నుంచి రూ.లక్ష ధర పలికింది. ఈ ఏడాది కర్ణాటక, బ్రెజిల్, ఇతర దేశాల్లో కూడా పొగాకు పంట ఆశాజనకంగా ఉండటంతోపాటు అక్కడ ధర కూడా అధికంగా ఉందని బోర్డు అధికారులు తెలిపారు.

అవశేషాలు, పురుగుమందులు ఉండకూడదు



పొగాకులో రసాయనిక పురుగు మందులు ఉండకూడదు. యూరోపియన్ యూనియన్ ఆంక్షలు పెరిగాయి. అవశేషాలు ఉన్న పొగాకు కొనుగోలుకు ట్రేడర్‌లు ముందుకు రాని పరిస్థితి. తప్పనిసరి పరిస్థితుల్లోనే పురుగుమందులు వాడాల్సి వస్తే శాస్త్రవేత్తలు సిఫార్సు చేసిన మందులను మాత్రమే వాడాలి. రైతులు నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేసి గిట్టుబాటు ధర పొందాలి.

– బి.శ్రీహరి, ధరల నిర్వహణ అధికారి, జంగారెడ్డిగూడెం –1

పొగాకు సాగు బాగుంది



నేను 130 ఎకరాల్లో ఈ ఏడాది పొగాకు పంట వేశాను. ఇప్పటివరకూ 4 దశల్లో పొగాకు రెల్పుతోపాటు క్యూరింగ్ పనులు కూడా చేపట్టారు. బోర్డు అధికారులు, శాస్త్రవేత్తల సలహాలతో పంట పండిస్తున్నారు. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా పంటకు గిట్టుబాటు ధర వస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నాను.

– సయ్యద్ బాజీ, పొగాకు రైతు, అచ్చియ్యపాలెం, బుట్టాయగూడెం మండలం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన కొల్లాటి వెంకట యువరాజు

ఆకివీడు: కూటమి సభలకు వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్న తల్లీ కొడుకులను ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్న సంఘటనలో కొడుకు మృతి చెందాడు. ఏలూరు జిల్లా చినతాడినాడకు చెందిన కొల్లాటి వెంకట యువరాజు(28) తన తల్లితో శనివారం ఉదయం ఆకివీడులోని సీఎం హైస్కూల్ ఆవరణలో జరుగుతున్న సభకు వెళ్లారు. తిరిగి రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి వెళ్తుండగా కారు వేగంగా ఢీకొట్టింది. సంఘటనలో యువరాజు, అతని తల్లికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108లో భీమవరం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి ఒంటి గంట ప్రాంతంలో మృతి చెందినట్లు ఎస్‌ఐ హనుమంతు నాగరాజు చెప్పారు. తల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో దంత వైద్యుడి మృతి

పెనుమంట్ర: మార్టేరు–పెనుగొండ రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నెగ్గిపూడి గ్రామానికి చెందిన దంత వైద్యుడు దంగేటి గోపాలకృష్ణ(61) అక్కడికక్కడే మృతి చెందారు. నెగ్గిపూడిలోని తన రంగూన్ దంత వైద్యశాల నుంచి బయటకు వచ్చి రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనదారుడు వేగంగా వచ్చి ఢీ కొనడంతో మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురూ వైద్య వృత్తిలోనే ఉన్నారు. ఆయన మృతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వేడుకగా నరసన్న కల్యాణోత్సవాలు



సుందరగిరిపై విశేష పూజలందుకుంటున్న నరసన్న



నారసింహుని ఆలయ ఆవరణలో ప్రాణాచారాలు పడిన మహిళలు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్.జగన్నాధపురంలోని సుందరగిరిపై స్వయంభూగా కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మహోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం ఆలయంలో విశేష కార్యక్రమాలు జరిగాయి. ఉదయం అర్చకులు, పండితులు నిత్య హోమాలు, మూలమంత్ర హవనాలు, బలిహరణ, వేదపారాయణ ఔపాసన మండప పూజలు జరిపి స్వామి, అమ్మవార్లకు హారతి, మంత్రపుష్పాలు సమర్పించారు. సాయంత్రం మూలమంత్ర హవనాలు, బలిహరణలు, హారతి, మంత్రపుష్పాలు తదితర కార్యక్రమాలు నేత్రపర్వంగా జరిగాయి. సంతానం కోసం పరితపించే పలువురు మహిళలు ఉదయం ఆలయ ప్రాంగణంలో ఆకుంఠిత దీక్షతో ప్రాణాచారాలు నిర్వహించారు. ముందుగా వారంతా నారసింహుడిని దర్శించారు. అనంతరం సుందరగిరిపై పాలపొంగళ్లు వండి స్వామికి నైవేద్యంగా సమర్పించుకున్నారు. సాయంత్రం వరకు ఆ మహిళలు నరసింహుని స్మరిస్తూ ఉపవాస దీక్షను చేశారు.

నేడు నారసింహుడి కల్యాణం

సుందరగిరి దిగువనున్న కల్యాణ మండపంలో నరసన్న దివ్య కల్యాణ మహోత్సవం సోమవారం ఉదయం 11.10 గంటలకు వైభవంగా జరగనుంది. ఇందుకు దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

పర్యాటకులతో పక్షుల కేంద్రం కళకళ



ఆటపాక పక్షుల కేంద్రం వద్ద బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

కైకలూరు: పర్యాటకులతో ఆటపాక పక్షుల విహార కేంద్రం ఆదివారం కళకళలాడింది. శీతాకాలం వలస పక్షులకు అనువైన కాలం కావడంతో పర్యాటకులు మార్చి లోపే వీక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఏలూరు, కృష్ణా, సమీప పశ్చిమగోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున యాత్రికులు కేంద్రాన్ని సందర్శించారు. బోటు షికారు చేస్తూ పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ పక్షులను దగ్గర నుంచి తిలకించారు. అనంతరం పక్షి నమూనా మ్యూజియంలో పక్షుల చిత్రాలు, బొమ్మలను వీక్షించారు. సమీపంలోని చిల్డ్రన్స్ పార్కులో చిన్నారులు ఆటలాడుకున్నారు. అటవీశాఖ డిప్యూటీ రేంజర్ ఎం.రంజిత్‌కుమార్, ఫారెస్టు బీట్ ఆఫీసర్ బి.రాజేష్ కొల్లేరు పక్షుల విశేషాలు, భౌగోళిక స్వరూపం యాత్రికులకు వివరించారు.

పెద్దింట్లమ్మను దర్శించుకున్న భక్తులు



కొల్లేటికోట పెద్దింట్లమ్మ తల్లి



కొల్లేటికోట అమ్మవారి ధ్వజ స్తంభం వద్ద పూజలు

కైకలూరు: అమ్మా పెద్దింట్లమ్మా.. మా కోరికలు నెరవేర్చమ్మా అంటూ భక్తులు కొల్లేటికోట పెద్దింట్లమ్మను ఆర్తితో వేడుకొన్నారు. సమీప జిల్లాల నుంచి కొల్లేటికోట అమ్మవారి దేవస్థానానికి భక్తులు ఆదివారం భారీగా తరలివచ్చారు. అమ్మకు నైవేద్యాలు పెట్టారు. సామూహిక భోజనాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు పేటేటి పరమేశ్వరశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆదివారం ఒక్క రోజునే ప్రత్యేక, అంతరాలయ దర్శనాలు, కేశఖండనశాల, పెద్ద, చిన్న తీర్థాలు, లడ్డు ప్రసాదం, గదుల అద్దెలు, అమ్మవారి చిత్రాల అమ్మకం, భక్తుల విరాళాలు, వాహన పూజలు ద్వారా మొత్తం రూ.57,455 ఆదాయం వచ్చిందని తెలిపారు. మార్చి 1 నుంచి 13 వరకు జరుగు పెద్దింట్లమ్మ జాతర ఉత్సవ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య



సోమశేఖర్ (ఫైల్)

ద్వారకాతిరుమల: మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఘంటా సోమశేఖర్(36) కడుపునొప్పి తాళలేక కలుపు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమశేఖర్‌కు, అనితకు 14 ఏళ్ల క్రితం వివాహం కాగా, వీరికి 11 ఏళ్ల వయస్సు ఉన్న కుమార్తె ఉంది. సోమశేఖర్ గతంలో ద్వారకాతిరుమల శివారులో న్యూ కీర్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నడిపాడు. ప్రస్తుతం సొంత పొలంలో వ్యవసాయం చేస్తున్నాడు. గత కొంత కాలంగా అతడు తీవ్రమైన గ్యాస్, కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలోనే మద్యం అలవాటైంది. ఈ నెల 5న రాత్రి 11.30 గంటల సమయంలో మద్యం సేవించి ఉన్న సోమశేఖర్‌కు తీవ్రంగా కడుపునొప్పి రావడంతో, బాధ భరించలేక వ్యవసాయం నిమిత్తం తెచ్చిన కలుపు మందు తాగాడు. ఈ విషయాన్ని 6న తెల్లవారుజామున తన భార్యకు చెప్పాడు. దాంతో బంధువులు, చుట్టుపక్కల వారి సహాయంతో ఆమె సోమశేఖర్‌ను భీమడోలులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందుల పిచికారీలో జాగ్రత్తలు



వరిపై పురుగు మందు పిచికారీ చేస్తున్న వ్యవసాయ కూలీ



బి.నాగకుమార్, వ్యవసాయ అధికారి

చింతలపూడి: రబీ పంటలపై చీడ పీడల నివారణకు మెట్ట ప్రాంతంలోని రైతులు పురుగు మందులను పిచికారీ చేయడంలో బిజీగా ఉన్నారు. పంటలను చీడ పీడల నుంచి రక్షించుకునే ప్రయత్నంలో రైతులు కనీస జాగ్రత్తలు పాటించడం లేదు. పురుగు మందుల పిచికారీలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఒక్కోసారి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. పురుగుమందుల పిచికారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చింతలపూడి వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సంచాలకుడు బి.నాగకుమార్ రైతులకు పలు సూచనలు చేశారు. ఒక్కోసారి ఎంత అప్రమత్తంగా ఉన్నా విష ప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. మూడు రకాలుగా పురుగు మందులు శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంది.

చర్మం ద్వారా..

పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో చర్మం ద్వారా విష పదార్థాలు శరీరంలోకి ప్రవేశించే ప్రమాదం ఉంది. ఒంటిపై పుండ్లు, గాయాలు ఉంటే మరింత సులభంగా శరీరంలోకి ప్రవేశిస్తుంది.

ముక్కు ద్వారా..

క్రిమిసంహారక మందుల ద్వార వెలువడే వాయువులు పీల్చడం ద్వారా విషం శరీరంలోకి ప్రవేశించి హాని కలిగిస్తాయి.

నోటి ద్వారా..

పురుగు మందులు పిచికారీ చేశాక చేతులు శుభ్రంగా కడుక్కోకుండా ఆహార పదార్థాలు భుజిస్తే నోటి ద్వార శరీరంలోకి వెళ్ళే ప్రమాదం ఉంది. ఒక్కొక్కప్పుడు మరణం కూడా సంభవిస్తుంది.

ఎలాంటి చికిత్స అవసరం

చర్మం ద్వార విష పదార్థాలు శరీరంలోకి ప్రవేశిస్తే వెంటనే సబ్బు, మంచినీటితో శుభ్రంగా కడగాలి. ఒకవేళ కళ్ళలో పడితే మంచినీటితో కడగాలి. చికిత్స కోసం వెంటనే దగ్గరలోని వైద్యుడిని సంప్రదించాలి. ముక్కుతో పీల్చితే విష ప్రభావానికి గురైన వ్యక్తిని గాలి, వెలుతురు బాగా వచ్చే ప్రదేశంలో ఉంచాలి. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటే వెంటనే కృత్రిమ శ్వాస అందించాలి. వీలైనంత త్వరగా వైద్యుడి వద్దకు తీసుకు వెళ్ళి చికిత్స అందించే ఏర్పాటు చేయాలి. క్రిమి సంహారక మందు నోటి ద్వారా కడుపులోకి వెళ్ళినప్పుడు వాంతి చేయించే మార్గాలను అన్వేషించాలి. గ్లాసుడు నీళ్ళలో ఉప్పు లేదా ఆవాల పొడిని తగిన మోతాదులో కలిపి తాగించాలి. కడుపు ఖాళీ అయ్యే వరకు ఇలా తాగిస్తూ ఉండాలి. వెంటనే వైద్యుడిని సంప్రదిస్తే తగిన చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చు. క్రిమి సంహారక మందు పిచికారీ సమయంలో శరీరం నిండా దుస్తులు ధరించి, ముక్కుకు, నోటికి గుడ్డ మాస్క్ ధరించాలి. లేదా సేఫ్టీ సూట్ ధరించి పిచికారీ చేయడం మంచిది.

● సూక్ష్మంలో ప్రేమ సందేశం



ఫిబ్రవరి 14 అంటే ప్రేమికులకు ఎంతో ప్రత్యేకం.. ఆ రోజున వాలంటైన్స్ డేను గ్రాండ్‌గా జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో నేషనల్ అవార్డు గ్రహీత, ఏలూరుకు చెందిన దోర శివప్రసాద్ బియ్యపు గింజని లవ్ సింబల్ ఆకారంలోకి తీర్చిదిద్దారు. ఈ సింబల్ అందరి ప్రశంసలు అందుకుంటోంది.

– ఏలూరు (టూటౌన్)

బతికున్న వ్యక్తికి డెత్ సర్టిఫికెట్

ఎల్ఐసీ డబ్బుల కోసం పన్నాగం



భూక్యా శ్రీరాములు పేరిట డెత్ సర్టిఫికెట్

కుక్కునూరు : బతికున్న వ్యక్తిని చనిపోయినట్లు డెత్ సర్టిఫికెట్ తీసుకుని డబ్బు కాజేసిన ఘటన సంచలనంగా మారింది. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలానికి చెందిన యాకుబ్ పాషా 2017లో అదే మండలంలోని సారపాక గ్రామం భాస్కర్ నగర్‌కు చెందిన భూక్యా శ్రీరాముల పేరున అతనికి తెలియకుండా ఎల్ఐసీ పాలసీ తీసుకున్నాడు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా ప్రీమియం చెల్లిస్తూ వచ్చాడు. అలాగే శ్రీరాములుతో స్నేహం చేస్తూ వచ్చాడు. 2024 జూన్‌లో శ్రీరాములు వద్దకు వెళ్లి నీ పేరు గల మరో వ్యక్తి ఆంధ్రప్రదేశ్‌లోని కుక్కునూరు మండలంలో ఉన్నాడంటూ నమ్మబలికి, అతను ఇటీవల మృతి చెందాడని, అతని పేరుపై ఎల్ఐసీ పాలసీ ఉందని, సహకరిస్తే రూ.10 లక్షలు వస్తాయని చెప్పి నమ్మబలికాడు. మరో వ్యక్తితో కలిసి పథకాన్ని అమలు చేశారు. కుక్కునూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శ్రీరాములు మృతిచెందినట్టుగా డెత్ సర్టిఫికెట్ సంపాదించారు. చివకు శ్రీరాములు భార్య ఖాతాలో బీమా సొమ్ము రూ.10 లక్షలు జమ కాగా.. ఆ డబ్బును డ్రా చేశారు. అందులో శ్రీరాములు వాటా రూ. 3 లక్షలు ఇచ్చేసిన యాకూబ్ పాషా మిగిలిన సొమ్ము తీసుకున్నాడు. మరో వ్యక్తి దుర్గారావుకు, యాకుబ్‌కు పంపకాల్లో తేడాలు రావడంతో ఈ విషయాన్ని దుర్గారావు బహిర్గతం చేశాడు. ఈ క్రమంలో కుక్కునూరు నుంచి డెత్ సర్టిఫికెట్ ఎలా పొందారన్నది స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

పరేడ్‌లో పాల్గొనడం మర్చిపోలేని అనుభూతి



సొనబోయిన దేవహర్షిణి

పాలకొల్లు అర్బన్: రిపబ్లిక్ డే సందర్భంగా న్యూఢిల్లీలో నిర్వహించిన రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం పూలపల్లికి చెందిన సొనబోయిన దేవహర్షిణి ఆదివారం స్వస్థలమైన పూలపల్లి చేరుకుంది. పరేడ్‌లో పాల్గొనడం మరిచిపోలేని అనుభూతినిచ్చిందన్నారు. ఆమె ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా కోరంగిలోని ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతోంది. ఎన్‌సీసీలో చేరి సీనియర్ అండర్ ఆఫీసర్‌గా పనిచేస్తోంది. దేవహర్షిణిని కళాశాల యాజమాన్యం,జేఎన్‌టీయూ, కాకినాడ అధ్యాపకులు సత్కరించారు.

క్లుప్తంగా

దేవదాసయ్య బోధనలు ఆచరణీయం


మాట్లాడుతున్న ఏసుపాదం

పెంటపాడు: బైబిలు మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ముంగమూరి దేవదాసయ్య ఏసుక్రీస్తును గుర్తించి బోధనలు ప్రతీ క్రైస్తవునికి ఆచరణీయం కావాలని పెంటపాడుకు చెందిన బైబిలుమిషను గవర్నింగ్ బాడీ మెంబర్ రెవరెండ్ పి. ఏసుపాదం పేర్కొన్నారు. పెంటపాడులో బైబిలుమిషన్ చర్చిలో ఆరాధన అనంతరం మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ ముంగమూరి దేవదాసయ్య జ్ఞాపకార్థం, ఆధ్యాత్మిక వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆరుగొలను బైబిల్ మిషన్ చర్చిలో మద్దా డేవిడ్ ఆధ్వర్యంలో ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవదాసయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ సేవకులు, విశ్వాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఘంటసాల వర్ధంతి సభలో పాల్గొనండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఘంటసాల గాన సభ వర్ధంతి సభ ఈ నెల 11వ తేదీ మంగళవారం నిర్వహిస్తున్నట్లు గాన సభ అధ్యక్షుడు ఎస్.ఖాసిం సాహెబ్, సలహాదారు పీటీ వెంకన్న, ఉపాధ్యక్షుడు అల్లం శంకరరావు, కార్యదర్శి డి.కృష్ణ, జాయింట్ సెక్రటరీ ఎస్కే నాగూర్ సాహెబ్, కోశాధికారి ఎస్.ఎస్.ఆర్ మూర్తిలు తెలిపారు. ఘంటసాల వర్ధంతి సందర్భంగా వీకర్స్‌కాలనీలో ఉదయం ఘంటసాల విగ్రహానికి పూజా కార్యక్రమం, సాయంత్రం బీవీఆర్‌లో ఘంటసాల సంగీత విభావరి, ఘంటసాల అవార్డును డాక్టర్ ఎస్‌పీఎస్ వాసు (ఏలూరు), ప్రముఖ నాదస్వర విద్యాంసులు నాగూర్ సాహెబ్, మదీనా బీబి అవార్డులను తెలుగు సాహితీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి పైలు శ్రీనివాసరావుకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కళాకారులు, సాహితీ సభ్యులు, పట్టణ ప్రముఖులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పేరిచర్లకు బెస్ట్ లయన్ అవార్డు



పేరిచర్లకు అవార్డుతో పాటు, మావుళమ్మ అమ్మవారి చిత్రపటం బహూకరిస్తున్న రీజియన్ చైర్మన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణానికి చెందిన డైమండ్స్ లయన్స్ లీడర్ పేరిచర్ల మురళీకృష్ణంరాజుకు బెస్ట్ అవుట్ స్టాండింగ్ అవార్డు వరించింది. ఈ సందర్భంగా పేరిచర్లను లయన్స్‌క్లబ్ సభ్యులు సత్కరించారు. మావుళ్లమ్మ అమ్మవారి చిత్రపటం బహుకరించారు. లయన్స్‌క్లబ్ జిల్లా 5వ రీజియన్ మీట్ రీజియన్ చైర్మన్ లయన్స్ పీవీ సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం నిడదవోలులో సభ జరిగింది. పేరిచర్లను అభినందించిన వారిలో డైమండ్స్ టీం సెక్రటరీ మద్దుకూరి మోహర్ ప్రసాద్, కోశాధికారి కాళ్ళ గోపికృష్ణ, ఉపాధ్యక్షుడు చెన్నారెడ్డి సతీష్, నార్ని వెంకట కృష్ణారావు, మరదాని రామ్మోహన్, ఆనంద స్వరూప్, వెజ్జు ధర్మరావు, బడుగు చంద్రశేఖర్, ఆకుల సతీష్, దుగ్గిరాల రామాకుమారి, వశిష్ట లియో క్లబ్ సభ్యులు ఉన్నారు.

20 మంది వృద్ధులకు ఉచిత వైద్యసేవలు

తణుకు అర్బన్: అనారోగ్యంతో ఇంటికే పరిమితమైన వృద్ధులకు తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యసేవలు అందజేశారు. తణుకు, ఇరగవరం, ఉండ్రాజవరం ప్రాంతాల్లో సంచార వాహనం ద్వారా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య తమ వైద్యసిబ్బందితో కలిసి ఇంటికే పరిమితమైన 20 మంది వృద్ధులకు వైద్యసేవలు అందజేశారు. సంఘ కార్యదర్శి ఎండీ స్వాలిహా ఆర్థికసాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతి ఆదివారం నిర్వహించే ఈ ఉచిత వైద్యసేవల కోసం 9985343530 నంబరులో సంప్రదించాలని కోశాధికారి అర్జి భాస్కరరావు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం చర్చా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

పెంటపాడు: విద్యాభివృద్ధి కోసం దేశ ప్రధాని సోమవారం నిర్వహించబోయే చర్చా కార్యక్రమాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు విజయవంతం చేయాలని ఎంఈవో టీవీ రామకృష్ణ కోరారు. ఉదయం 11 గంటలకు యూట్యూబ్ లింక్ ద్వారా ప్రధానమంత్రి విద్యార్థులతో మాట్లాడతారన్నారు. అన్ని పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రత్తిపాడులో నేడు సోలార్ రూఫ్‌టాప్‌పై అవగాహన

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు విద్యుత్ వినియోగదారులకు ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు కార్యదర్శి పి. నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అధికారులు, సోలార్ వలంటీర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.


స్థానిక పరిసరాల్లో మురుగు నీటి నిల్వలు


దోమల నివారణకు గంబూషియా చేపలు విడుదల (ఫైల్)


హెల్త్ సిబ్బందిచే స్ప్రేయింగ్ (ఫైల్)


దోమల నివారణకు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న వైద్య సిబ్బంది

విజృంభిస్తున్న దోమలు

- రక్తాన్ని పీల్చేస్తున్నాయ్
- కదలని మురుగు
- కొరవడిన పర్యవేక్షణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): దోమ పరిమాణంలో చిన్నదే అయినా కుట్టిందంటే ఎంతటివారైనా ఆసుపత్రి పాలవ్వాల్సిందే. అధ్వానంగా మురుగు కాలువులు, ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు, ముందుకు కదలని మురుగు వెరసి తాడేపల్లిగూడెం పట్టణంలో దోమల వ్యాప్తికి ప్రధాన కారణమవుతున్నాయి. చీకటి పడితే చాలు పుర ప్రజలపై దోమలు దండ యాత్ర చేస్తున్నాయి. ఇంటి తలుపులకు మెస్‌లుఉన్నా ఏదో రకంగా లోపలికి చొరబడి దాడి చేస్తున్నాయి. ఇక ఆరుబయట ఒక్క క్షణం ఉండలేని పరిస్థితి. ఇప్పటికే ఉక్కపోత మొదలైంది. సాయంత్రం వేళ చల్లగాలికి బయట ఉండే పరిస్థితి లేకుండా పోయింది. దోమల నుంచి చిన్నారులు, వృద్ధులను కాపాడుకునేందుకు పట్టణ ప్రజలు నానా తిప్పలు పడుతున్నారు. వీటి నియంత్రణకు అధికారులు తీసుకుంటున్న తూతూ మంత్ర చర్యలు వాటిపై ఎలాంటి ప్రభావం చూపడం లేదు. ఇక ఇళ్లల్లో దోమల నియంత్రణకు వాడే వివిధ రకాల చర్యలు అనారోగ్యానికి కారణమవుతున్నాయి.

తాడేపల్లిగూడెంలో నీటి నిల్వలు ఉన్న ప్రాంతం

తాడేపల్లిగూడెంలో నీటి లభ్యత వనరులు సంవృద్ధిగా ఉండటం, వేసవి, వర్షకాలం, శీతాకాలం అంటూ తేడా లేకుండా సంవత్సరం పొడవున నీటి లభ్యత ఉంటుంది. ఒక వైపు ఏలూరు కాలువ, మరో వైపు తాగునీటి అవసరాలకు పెద్ద పంపులు చెరువులు, వివిధ చెరువులు ఉన్నాయి. రెండు పూటల తాగు నీటికి నీరు సరఫరా కావడంతో నీటి కొరత లేదు. అక్కడక్కడ కొన్ని ఏరియాల్లో మినహా, దీంతో నీటి వాడకం ఎక్కువగా ఉంటుంది. డ్రెయిన్‌లు, నీటి గుంటలు ఆరిపోవు. మంచినీటిని తాగునీటికే కాక, వాడకం నీరుగా ప్రజలు వాడతారు. వాడకం నీరు వేసవిలో సైతం ఎండిపోవడం జరగదు. దీంతో దోమలు తగ్గవు అని పలువురు చెబుతున్నారు.


ఫ్రిడ్జి వెనక భాగంలో నీటి నిల్వల పరిశీలన

వివిధ రకాల దోమలు

చిన్నదోమ ఆరోగ్యానికి పెను ముప్పుగా మారుతుంది. రాత్రి నిద్రిస్తున్నప్పుడు మన చెవులు వద్ద మోతా మోగిస్తుంటాయి. కొన్ని సందర్భాలలో పగటి పూట కూడా దోమలు ఉధృతి ఉంటుంది.

> **దోమల నివారణకు కృషి చేయాలి**
>
> 
>
> పట్టణంలో దోమలు విచ్చలవిడిగా పెరిగాపోయాయి. పగలు, సాయంత్రం, రాత్రి అనే తేడా లేకుండా అన్ని సమయాలలో దోమల ఉధృతి ఎక్కువగా ఉంది. దోమల నివారణకు ఎన్ని రకాల నివారణ చర్యలు వాడుతున్న, దోమలు తగ్గడం లేదు. రోగాలు భారీన పడుతున్నాం. దోమల నివారణకు అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలి.
>
> – కోడే రమేష్, తాడేపల్లిగూడెం

ఈ దోమలు మన దేశంలో 8 రకాలు ఉన్నాయి. దోమలు ఏడెస్, అనాఫిలిస్, క్యూలెక్స్, కులిసేట, మాన్సోనియా, పోరోపోరా, సైయోమియా, టోక్సోరిస్కైట్స్ వంటి రకాలు దోమలు వివిధ ప్రాంతాల్లో తిరుగుతుంటాయి.

దోమల వల్ల వచ్చే వ్యాధులు

ఏడిస్ దోమ కారణంగా డెంగ్యూ, ఎల్లో ఫీవర్, వెస్ట్‌సైల్, చికున్ గున్యా వంటి ప్రాణాంతక జ్వరాలు వస్తాయి. ఈ దోమలు సాధారణంగా వరద నీటికొలనులు, చిత్తడి నేలలు, నీటితోనిండిన సహజలేదా కృత్రిమ కంటైనర్లలో కనిపిస్తాయి. ఇవి ఆరుబయట కన్పిస్తున్నప్పటికి పగటిపూట ఇంట్లో కి ప్రవేశించి పగటిపూట కుడతాయి. మాన్సోని యా దోమలు సాయంత్రంపూట కుట్టడంవల్ల మెదడు వాపు వ్యాధి సంభవిస్తుంది. అనాఫిలిస్ నీరు నిలిచిన ప్రాంతాలలో గుడ్లు పెడుతుంది. దోమలు పగటిపూట కుట్టడంవల్ల మలేరియా వస్తుంది. అదే విధంగా మురుగు నీటిలో దోమలు ఉత్పత్తి చేసే క్యూలెక్స్ రకం దోమలవల్ల ఫైలేరి యా సూక్ష్మ క్రిమి వల్ల బోదకాలు వస్తుంది, వెస్ట్ సైల్ వైరస్ ఇన్ఫెక్షన్ కూడా ఈ రకం దోమలవల్ల వస్తుంది. హెల్త్ అధికారులు, సిబ్బంది నిత్యం ఫీవ ర్ సర్వేలు చేయడం, ఫైలేరియా సర్వేలు చేస్తున్నారు.


ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన చేస్తున్న దృశ్యం(ఫైల్)

హెల్త్ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది చేస్తున్న కృషి

కీటక జనిత వ్యాధులను అరికట్టేందుకు వీలుగా సిబ్బంది లార్వాలు ప్రదేశాలను గుర్తించడం, ప్రజల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, క్షేత్ర స్థాయి పరిశీలనలు, దోమ లార్వాలను అరికేట్టందుకు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని కోరడం, గంబూషియా ఫిషలను చెరువులో, నీటిగుంటలలో వదలడం, దోమల నివారణకు సాయంత్రం సమయాలలో ఫాగింగ్, డ్రెయిన్‌లలో దోమ నివారణమందు మలాథిన్ స్ప్రేయింగ్ చేయడం, ఇండోర్ స్పేస్ స్ప్రేయింగ్ చేయించడం, దోమ తెరలు వాడండి అనడం ఇలా ఎన్నో విధాలుగా వారు దోమల నివారణకు కృషి చేస్తున్నారు.

దోమల నివారణకు ప్రణాళికలు లేవు

పారిశుద్య అధికారులు, సిబ్బంది అపారిశుధ్య పరిస్థితులు లేకుండా పట్టణాన్ని సుందర నందనంగా తీర్చిదిద్దుతున్నప్పటికి, ఎక్కడ పడితే అక్కడ చిత్తడి నీటి నిల్వలు, కదలని డ్రెయిన్‌లు, ఖాళీస్థలాలలో నీటి నిల్వలు, అన్ని చోట్లు తడిప్రాంతాలను కట్టడి చేయలేకపోవడం జరుగుతుంది. దోమలను కట్టడి చేసేందుకు వారి వద్ద ఎటువంటి ప్రణాళికలు లేవని ప్రజలు అంటున్నారు.

మేము తగ్గేది లేదు

దోమ నేను తగ్గేది లేదు అంటూ కొన్ని రోజులు క్రితం సాయంత్రం, రాత్రి సమయాలలో మాత్రమే ఇళ్లలోకి వచ్చి కుట్టడం చేసేవి, నేడు వాటి జనాభ బాగా పెరిగిపోవడంతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా దోమలు విజృంభిస్తున్నాయి. మస్కిటో కాయిల్స్, జెట్ కాయిల్స్, వివిధ దోమల నివారణ అగరత్తులు, విద్యుత్ బ్యాట్‌లు ఎన్నివచ్చినా దోమలు విచ్చలవిడిగా పెరిగాయి. ప్రజలు దోమల నివారణకు ఎంత ఖర్చు చేసినా వాటిని నియంత్రించడం సాధ్యం కావడం లేదు. పగలు అనక, రాత్రి అనక కుట్టడం మాత్రమం ఆపడం లేదు.


ఇంటి లోపల దోమల నివారణ చర్యలు(ఫైల్)


పట్టణంలో ఫాగింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

పీడీఎఫ్ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం

తణుకు అర్బన్: శాసనమండలిలో పేద, బడుగు బలహీన వర్గాల గొంతు వినిపించడం కోసం పీడీఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం తణుకులోని లో వివిధ సంస్థల్లో ఉన్న గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడీఎఫ్ అభ్యర్థులకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. 2007నుంచి పీడీఎఫ్ తరపున పోటీచేసి ఎమ్మెల్సీలుగా గెలిచిన చుక్క రామయ్య, ఇళ్ల వెంకటేశ్వరరావులు రాష్ట్రంలోని ఉద్యోగులు, కార్మికులు, పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల, యువత సమస్యలపై శాసన మండలిలో పోరాటం సాగించారని గుర్తు చేశారు. అధికార కూటమి ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు 164 సీట్లు ఇచ్చినా గ్రాడ్యుయేట్ స్థానాల్లో కూడా పోటీ చేయడం అన్యాయమని అన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రమేష్, రామకృష్ణ, శివ కుమార్, శర్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


తణుకులో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని కరపత్రాలు ఆవిష్కరించిన ప్రతాప్ తదితరులు

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్


అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని కోర్టు భవనాల సముదాయంలో మార్చి 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అన్ని సివిల్ కేసులు, రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్, చెక్కుబౌన్స్, వాహన ప్రమాద బీమా కేసులను పరిష్కరిస్తామని తెలిపారు. రాజీ మార్గమే రాజమార్గమని ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకోవాలని, కేసుల నుంచి విముక్తి కావాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

తణుకు అర్బన్: తణుకు మండలంలోని రైతులంతా త్వరితగతిన రైతు రిజిస్ట్రేషన్ ఏపీఎఫ్ఆర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవాలని తణుకు మండల వ్యవసాయాధికారిణి కె.కుసుమ అన్నారు. తణుకు మండలం దువ్వ గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు అన్నింటికీ రాయితీలు, డబ్బులు రైతులకు జమ కావాలన్నా రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. అన్నదాత సుఖీభవ తదితర ఏ స్కీములో అర్హత కావాలన్నా ఏపీఎఫ్ఆర్‌లో నమోదు కావాల్సిందేనని అన్నారు. దువ్వ, మండపాక కేంద్రాలకు వచ్చిన రైతులకు రైతు రిజిస్ట్రేషన్ చేశారు. ఈ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి పొలం 1బీ, ఆధార్, ఆధార్‌కి లింక్ అయిన మొబైల్ నంబరు తీసుకుని రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు.


దువ్వ రైతు భరోసా కేంద్రంలో రైతు రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి కుసుమ

రైతులకు యూనిక్ ఐడీ

పెంటపాడు: వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ (డిజిటలైజేషన్) చేయుటకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడీ) కేటాయిస్తుందని మండల వ్యవసాయాధికారి కె. పార్థసారధి ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డ్ తరహాలోనే రైతులకు ప్రత్యేకంగా ఈ కార్డు ఇస్తారని ఆమె తెలిపారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పెట్టుబడి రాయితీ, ఎరువుల రాయితీ, పంటల బీమా పలు రకాల వ్యవసాయ అనుబంధ సేవలు పొందాలంటే తప్పనిసరిగా ఈ కార్డు తీసుకోవాలని ఆయన తెలిపారు.

మద్యం షాపుల లాటరీ ప్రక్రియ వాయిదా

తాడేపల్లిగూడెం (టీఓసీ): గీత సామాజిక వర్గానికి కేటాయించిన నాలుగు మద్యం షాపులకు ఈనెల 10న జరగాల్సిన లాటరీ ప్రక్రియ వాయిదా పడినట్లు ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి అన్నారు. ఆదివారం తాడేపల్లిగూడెంలో ఆమె ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో లాటరీ ప్రక్రియ వాయిదా వేసినట్లు చెప్పారు. ఎన్నికల కమిషన్ అనుమతి అనంతరం లాటరీ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు.

మద్యం దుకాణాల లాటరీ వాయిదా

తణుకు అర్బన్: తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలో కల్లుగీత వర్గాలకు కేటాయించిన 5 మద్యం దుకాణాలకు సంబంధించి అందజేసిన దరఖాస్తుల లాటరీ ప్రక్రియ వాయిదా పడినట్లు ఆ శాఖ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. సోమవారం భీమవరంలో జిల్లా కలెక్టర్ సమక్షంలో నిర్వహించాల్సి ఉన్న లాటరీ ప్రక్రియ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సందర్భంగా వాయిదా పడినట్లు చెప్పారు. ఎలక్షన్ కమిషన్ నిర్ణయం మేరకు లాటరీ ప్రక్రియ నిర్వహించే తేదీని తెలియపరుస్తామని దరఖాస్తుదారులు గమనించాలని కోరారు.

నిలువెత్తు నిర్లక్ష్యం..


తణుకు ఎన్జీవో కాలనీ ఎస్ఎఫ్ఎస్ స్కూలు వెనుక వీధిలో విద్యుత్ వెలుగుకు ఆటంకంగా మారిన పాదులు


తణుకు సజ్జాపురం రామకృష్ణ మఠం ప్రాంతంలో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభంపైకి పాకిన పాదులు

తణుకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలపైకి పచ్చని పాదులు పాకి ప్రమాదకరంగా మారాయని స్థానిక నివాసితులు ఆరోపిస్తున్నారు. స్తంభాల మొదట్లో మొదలైన వివిధ రకాల పాదులు స్తంభాలపైకి ఎగబాకి విద్యుత్ తీగలపైకి అల్లుకుపోతున్నా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ముఖ్యంగా పాదులకు ఉన్న పువ్వులు, గుమ్మడికాయల కోసం పిల్లలు సైతం విద్యుత్ స్తంభాలను పట్టుకుని ఆడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని భయాందోళన నెలకొంది. అంతే కాకుండా స్తంభంపై ఉన్న విద్యుత్ దీపాలకు కూడా పాదలు అల్లుకు పోవడంతో వెలుగు కూడా కిందకు రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఈ పాదులను తొలగింపు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. - తణుకు అర్బన్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


తణుకులో 1974-75 పదో తరగతి బ్యాచ్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు


తణుకులో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

50 ఏళ్లనాటి స్నేహబంధం వికసించిన వేళ..

తణుకు అర్బన్: 50 ఏళ్లనాటి స్నేహబంధం స్వర్ణోత్సవ వేడుక పేరుతో ఒకే వేదికపై కలిసి ముచ్చటించుకున్నారు. గత స్మృతులను నెమరివేసుకున్నారు. పదో తరగతిలో గురువులు నేర్పిన క్రమశిక్షణ, విద్యార్థిగా చేసిన అల్లర్లు, పాఠశాల ఎగ్గొట్టి ఆడిన ఆటలు, పోటాపోటీ విద్య, గురువుల బెత్తం దెబ్బలు వంటి అంశాలను గుర్తు చేసుకున్నారు. 50 ఏళ్ల అనంతరం తమను ఒకరినొకరు గుర్తుపట్టలేని విధంగా మారిపోయామని, స్నేహానికన్న మిన్న లోకానలోదురా అంటూ ఉల్లాసంగా గడిపారు. 1974-75 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు స్వర్ణోత్సవ వేడుకను పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికగా తణుకు చిట్టూరి హెరిటేజ్ హోటల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పరిచయాలు చేసుకుంటూ వారి కష్టనష్టాలను పంచుకున్నారు. అనంతరం అప్పటి గురువులను ఘనంగా సత్కరించారు. తాము విద్యనభ్యసించిన జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు వెళ్లి తీపిగుర్తుగా ఫొటోలు తీసుకున్నారు.

క్రమశిక్షణతో విద్య అభ్యసించాం..

అనంతరం ఇదే బ్యాచ్‌కు చెందిన పారిశ్రామిక వేత్త, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ 50 ఏళ్ల మన స్నేహం ఎంతో అపురూపమైనదని దేశ, విదేశాల్లో స్థిరపడ్డ మన మిత్రులంతా ఒకే వేదికపైకి వచ్చి కలుసుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ఆనాటి చదువు ఎంతో క్రమశిక్షణతో ఉండేదని, గురువుల మాట వేదవాక్కుగా భావించే పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. స్నేహితులందరూ మంచి స్థితిలో ఉండడం మంచి విషయమని స్పష్టం చేశారు.